క్లుప్తంగా

మరిడమ్మకు ప్రత్యేక పూజలు



బంగారు, వెండి పుష్పాలతో పూజలు అందుకున్న అమ్మవారు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పు మరిడమ్మ అమ్మవారికి శుక్రవారం బంగారు, వెండి పుష్పాలతో పాటు, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, చండీహోమంతో పాటు బంగారు పుష్పాలతో పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సమస్యలపై 17న ధర్నా



సమావేశంలో మాట్లాడుతున్న బేబీరాణి

సామర్లకోట: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల సమస్యలపై ఈ నెల 17వ తేదీన ఆయా ప్రాజెక్టుల పరిధిలో ధర్నా నిర్వహించనున్నట్టు అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకుల సంఘ రాష్ట్ర అధ్యక్షురాలు జి.బేబీరాణి తెలిపారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం జరిగిన పెద్దాపురం ప్రాజెక్టు 11వ సెక్టార్ సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సీఐటీయూ మద్దతుతో జరిగే ధర్నాలో అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు డి.క్రాంతి కుమార్, కె వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సర్వర్లు మొరాయించి రైతులకు ఇక్కట్లు



సామర్లకోట రైతు సేవా కేంద్రం వద్ద వేచి ఉన్న రైతులు

సామర్లకోట: మండల పరిధిలోని రైతు సేవా కేంద్రాలలో సర్వర్లు మొరాయించడంతో శుక్రవారం రైతులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. రైతులు వివిధ పథకాలు పొందేందుకు ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేయించుకోవాలని సమాచారం ఇవ్వడంతో రైతులు ఆయా రైతు సేవా కేంద్రాలకు తరలి వచ్చారు. పీఎం కిసాన్ చెల్లింపులు, అన్నదాత సుఖీభవ, పెట్టుబడి సాయం, రాయితీపై వ్యవసాయ యంత్రాలు, పంటల బీమా, పంట రుణాలపై వడ్డీ రాయితీ, సున్నా వడ్డీపై సూక్ష్మ రుణాలు వంటి పథకాలను నమోదు చేయించుకోవడానికి ఆయా రైతు సేవా కేంద్రాల్లో గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చిందని రైతులు ఆరోపించారు. దీనిపై మండల వ్యవసాయాధికారి ఐ సత్యను వివరణ కొరగా కేవలం 30 నిమిషాలు మాత్రమే సర్వర్లు పని చేయలేదని వివరించారు.

టిడ్కో వాసులూ.. అప్రమత్తం

సామర్లకోట: పిఠాపురం రోడ్డులోని టిడ్కో గృహాలలో నివసిస్తున్న వారు అప్రమత్తంగా ఉండాలని సీఐ ఎ.కృష్ణభగవాన్ పిలుపునిచ్చారు. శుక్రవారం రాత్రి టిడ్కో లబ్ధిదారులతో ఆయన సమావేశం నిర్వహించారు. రాత్రి సమయంలో కాలనీలో అనుమానంగా తిరుగుతున్న, కొత్త వారు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. రోడ్డు మార్జిన్‌లో టిడ్కో ఇళ్లు ఉండటంతో దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ప్రతి రోజు పోలీసు నిఘా ఉంచుతామని, స్థానికులు పోలీసులకు సహకరించాలన్నారు. ఆయా ప్రాంతాలలో రాత్రి సమయంలో తిరుగుతున్న ఆకతాయిలకు సీఐ కౌన్సెలింగ్ చేశారు.

సారా బట్టీపై పోలీసుల దాడి

కొత్తపల్లి: సారా బట్టీపై దాడిచేసి ఒక వ్యక్తిని అరెస్టు చేసినట్లు పోలీసులు శుక్రవారం తెలిపారు. వారు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని పొన్నాడ శివారు కోనపాపపేట సమీపంలోని తోటలో సారా తయారు చేస్తున్నారని సమాచారంతో ఎస్సై వెంకటేష్ తన సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడిలో కోనపాపపేటకు చెందిన పిల్లి భూషణాన్ని అరెస్టు చేసి సారా బట్టీని, సామగ్రిని, తయారీకి ఉపయోగించే బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. తన వద్ద నుంచి 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

పిఠాపురం: పెద్దాపురం, పాయకరావుపేట 132 కేవీ విద్యుత్ ప్రధాన లైన్ మార్పు వల్ల ఆదివారం మల్లవరంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ ప్రభాకర్ తెలిపారు. ఆ గ్రామంతో పాటు వ్యవసాయ పరిధిలో ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటల మధ్యలో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

నోటమాట లేదు!

- నష్టాల బాటలో టమాటా రైతులు
- అమాంతం ధర పతనం
- పెట్టుబడులు సైతం రాలేదంటూ రైతుల ఆందోళన



దుర్గాడలో కొనే వారు లేక పొలాల వద్ద పడి ఉన్న టమాటా

పిఠాపురం: టమాటా చూడడానికి ఎంత సున్నితంగా ఉంటుందో సాగు సైతం అంతే సున్నితం. దిగుబడుల మాట ఎలా ఉన్నా రేటు మాత్రం రైతును ఎప్పుడు ముంచుతుందో ఎప్పుడు లాభాల్లో తేలుస్తుందో తెలియని పరిస్థితి. ఇటీవల కాలంలో టమాటా ధర గగనానికేగగా, ఇప్పుడు హఠాత్తుగా పతనమైంది. దీంతో పంట సాగు చేసిన రైతు దివాళా తీసే పరిస్థితి నెలకొంది. టమాటా పంట వేసి కోటీశ్వరుడయ్యారనే వార్తలు ఆశ్చర్యాన్ని కలిగించినా అప్పట్లో ఉన్న రేటు ఆ రైతును కోటీశ్వరుడిని చేసింది. అదే టమాటా కేజీ రూపాయికి కూడా కొనే వారు లేక రోడ్లపై పారబోసిన సందర్భాల్లో అదే రైతులు తీవ్ర నష్టాలను చవి చూసిన సందర్భాలు ఉన్నాయి. అలాంటి పరిస్థితే మళ్లీ వచ్చింది.

ప్రస్తుత ధర పతనం ఇలా..

రెండు నెలలకు ముందు కేజీ టమాటా ధర రూ.30 వరకు ఉండగా అప్పట్లో పంట అందుబాటులో లేదు. ప్రస్తుతం ఈ పంట అన్ని చోట్లా అందుబాటులోకి వచ్చింది. దీంతో ఉత్పత్తి పెరగి సరకు పూర్తిగా అందుబాటులోకి రావడంతో ధర అమాంతం పడిపోయింది. ప్రస్తుతం రైతు వద్ద కేజీ రూ.3కు పడిపోయింది. అది కూడా కొనే నాథుడు లేక కొన్ని చోట్ల తోటలు పీకి పారేసే పరిస్థితులు నెలకొన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న ధర వల్ల కనీసం కోత కూలి కూడా రావడం లేదని రైతులు వాపోతున్నారు. ఎకరానికి రూ. 50 వేలకు పైగా పెట్టుబడులు పెట్టగా రూ.30 వేలు కూడా ఆదాయం రాని పరిస్థితులు నెలకొన్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నియోజకవర్గంలో టమాటా సాగు ఇలా..

సాగు చేసే రైతులు	– 320 మంది
సాగు చేసిన భూమి	– 250 ఎకరాలు
దిగుబడి	– సుమారు 6250 టన్నులు

పెట్టుబడి కూడా రావడం లేదు

ధర బాగున్నప్పుడు పంట సాగు చేశాం. ఎకరానికి రూ.50 వేలకు పైగా పెట్టుబడి అయ్యింది. నెల రోజులుగా పంట కోతకు రాగా ముందు కొంచెం బాగానే ధర ఉన్నా రెండు వారాల నుంచి ధర పూర్తిగా పడి పోయింది. దీంతో కోత కూలి కూడా రావడం లేదు. ప్రస్తుతం పంట దిగుబడి బాగా రావడంతో ఎక్కడికక్కడ టన్నుల కొద్దీ టమాటాలు అందుబాటులో ఉన్నాయి. దీంతో కొనేవారు తక్కువగా ఉండి పంట ఎక్కువగా ఉండడంతో కనీస ధర కూడా రావడం లేదు. ఈ ఏడాది టమాటా సాగు వల్ల తీవ్ర నష్టాలు చవి చూస్తున్నాము. కోత కోయించకుండా వదిలేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

– జి.శ్రీను, టమాటా రైతు, దుర్గాడ, గొల్లప్రోలు మండలం

ధర పతనంతో ఇబ్బంది



టమాటా ధరలలో అస్థిరత్వం ఒక్కోసారి రైతును తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుంది. ఎక్కువగా ఏప్రిల్, మే నెలల్లో టమాటా దిగుబడులు లేక రేటు విపరీతంగా పెరిగిపోతుంది. అప్పుడు మరింత లాభాలు వచ్చే అవకాశం ఉండడంతో ఆ సమయంలో అందుబాటులోకి వచ్చేలా పంటలు సాగు చేసుకోవాలి. జనవరి నుంచే ఎక్కువ మొత్తంలో దిగుబడి అందుబాటులోకి రావడంతో వినియోగం కంటే ఎక్కువ పంట అందుబాటులో ఉండి ధర అమాంతం పడిపోతుంది. అదే ఇప్పుడు జరిగింది.

– కేఎస్ శైలజ, ఉద్యాన శాఖాధికారి, పిఠాపురం

రహదారి భద్రతలో ఉత్తమ పురస్కారం



జిల్లా ఎస్పీ నుంచి పురస్కారం అందుకున్న ప్రకాష్

సామర్లకోట: రహదారి భద్రతపై ఇటీవల ప్రతిభా విద్యానికేతన్ పాఠశాల విద్యార్థులతో అవగాహన కల్పిస్తూ అనేక కార్యక్రమాలు నిర్వహించిన పాఠశాల కరస్పాండెంట్ ఎస్‌వీవీజీ ప్రకాష్‌కు ఉత్తమ పురస్కారం లభించింది. శుక్రవారం కాకినాడలో డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ కె.శ్రీధర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ బిందు మాధవ్ ముఖ్య అతిథిగా పాల్గొన్ని అవార్డు అందజేసినట్టు ప్రకాష్ స్థానిక విలేకర్లకు తెలిపారు.

ఎండీయూ ఆపరేటర్ సస్పెన్షన్ ఎత్తివేత

సామర్లకోట: స్థానిక ఎండీయూ ఆపరేటర్ల సంఘ అధ్యక్షుడు దర్శిపాటి సత్యానందంపై విధించిన సస్పెన్షన్ ఎత్తివేసినట్లు తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి శుక్రవారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల ఆయనపై ఆరోపణలు రావడంతో ఆర్డీఓ ఆయనను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఈ మేరకు ఆయనపై ఆరోపణ రుజువు కాకపోవడంతో సస్పెన్షన్‌ను రద్దు చేస్తూ ఆర్డీఓ ఎస్ మల్లిబాబు శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చారని తహసీల్దార్ తెలిపారు.

దివ్యాంగుల గుర్తింపునకు చురుగ్గా సర్వే

పిఠాపురం: జిల్లా కోర్టు ఆదేశాలతో పిఠాపురం 12వ అదనపు జిల్లా జడ్జి ఎ.వాసంతి సూచన మేరకు నియోజవర్గంలో దివ్యాంగుల గుర్తింపునకు డోర్ టు డోర్ సర్వే చేపట్టారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దివ్యాంగులకు ఏ విధమైన గుర్తింపు ఇస్తున్నారు, వారికి కల్పిస్తున్న వసతులు, వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తిస్తూ నియోజవర్గంలో పలు గ్రామాల్లో ప్యానల్ లాయర్లు పారా లీగల్ వలంటీర్లు, అంగన్‌వాడీ వర్కర్లు, టీచర్లు, ఆశా వర్కర్లు ఏఎన్ఎంలు రోజువారీ సర్వే చేపట్టారు. ఇప్పటివరకు గొల్లప్రోలు మండలం కొడవలి, తాటిపర్తి, పిఠాపురం మండలం కోలంక, గోకివాడ, ఎల్ఎన్ పురం, జగపతిరాజపురం, మాధవపురం, కొత్తపల్లి మండలం నాగులపల్లి, ఉప్పాడ,తదితర గ్రామాల్లో ఈ సర్వే పూర్తి చేశారు. మిగిలిన గ్రామాల్లో పూర్తి చేయాల్సి ఉందని వారు తెలిపారు. ఈ నెల 24వ తేదీ లోపు ఈ సర్వే పూర్తి చేయవలసి ఉందని కోర్టు సిబ్బంది తెలిపారు.

చోరీ కేసులో నిందితుడికి ఏడాది జైలు

పిఠాపురం: చోరీ కేసులో ముద్దాయికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ పిఠాపురం ప్రిన్సిపల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఎం.విజయ రామేశ్వరి శుక్రవారం తీర్పు చెప్పారు. సీఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల మేరకు పెద్దాపురం మండలం ఉలిమేశ్వరానికి చెందిన ఎండపల్లి సూరిబాబు పిఠాపురం లయన్స్ క్లబ్ ఏరియాలోని ఇంటిలోకి ప్రవేశించి నగదు అపహరించాడు. 2022లో జరిగిన ఈ చోరీ కేసును అప్పటి ఎస్సై బి.శంకరావు దర్యాప్తు చేశారు. ముద్దాయిని కోర్టులో హాజరు పరచగా, నేరం రుజువు కావడంతో సూరిబాబుకు ఏడాది జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

అధికారుల ఆదేశాలు బేఖాతరు

కాకినాడ రూరల్: తనపై వ్యక్తిగత కక్షలను పెంచుకుని అధికారులు ఇచ్చిన నివేదికను పక్కదారి పట్టిస్తున్నారని మండలంలోని పి.వెంకటాపురం వీఓఏ కనకమహాలక్ష్మి పేర్కొన్నారు. గ్రామంలోని శ్రీ సత్యసాయి గ్రూపునకు సంబంధించి బ్యాంక్ ఖాతాలో ఉండిపోయిన సొమ్ములను వారికి అప్పగించాలని ఆదేశాలు ఉన్నప్పటికీ ఇవ్వకుండా కొందరు మహిళలు అడ్డుపడుతున్నారని శుక్రవారం ఆమె విలేకరులకు తెలియజేశారు. గ్రామంలో డ్వాక్రా సంఘాల సొమ్ములపై అవినీతి ఆరోపణలు చేయడంతో డీఆర్‌డీఏ పీడీ ఆదేశాల మేరకు వెలుగు అధికారులు దర్యాప్తు చేసి నివేదిక ఇచ్చారన్నారు. నివేదిక ప్రకారం లావాదేవీలలో కొన్ని తేడాలు ఉన్నాయని, గ్రామ సంఘానికి అప్పగిస్తానని తెలిపినా కావాలని కొందరు దుర్భషలాడుతూ మానసికంగా వేధిస్తున్నారని వివరించారు.

అవయవదానంపై అపోహలు వద్దు



అవయవదానంపై అవగాహన కల్పిస్తున్న సత్యనారాయణ

బోట్‌క్లబ్: ఒకరి అవయవదానంతో ఎనిమిది మందికి ప్రాణదానం చేయవచ్చునని ఇండియన్ డెంటల్ అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ అడ్డాల సత్యనారాయణ అన్నారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ అవయవదాన దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అవయవ దానం అంటే ఒక వ్యక్తి అవయవాన్ని తొలగించి మరొక వ్యక్తికి మార్పిడి చేయడానికి చట్టబద్ధంగా చేసే ప్రక్రియ అన్నారు. సాధారణ మార్పిడిలో మూత్రపిండాలు, గుండె, కాలేయం, క్లోమం, ఊపిరితిత్తులు, ఎముకలు ఉంటాయన్నారు. కొన్ని అవయవాలు జీవించి ఉన్న దాతలు సైతం దానం చేయవచ్చునన్నారు. మూత్రపిండం, కాలేయంలో కొంత భాగం, క్లోమంలో కొంతభాగం, ఊపిరితిత్తుల్లో కొంతభాగం దానం చేయవచ్చునన్నారు. ప్రతి ఒక్కరూ అవయవదానం మీద అపోహలు వీడి ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు నాగేంద్ర, చైతన్య, విద్యార్థులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ



హైస్కూల్‌లో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించిన ఎంఈఓ పుల్లయ్య

సామర్లకోట: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రతి విద్యార్థి స్వీకరించాలని ఎంఈఓ-2 పి.పుల్లయ్య అన్నారు. శుక్రవారం స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయన తనిఖీ చేశారు. అందరూ కలసి ఒకచోట భోజనం చేయడం వల్ల దానిలోని లోటుపాట్లు తెలుస్తాయని, ఆ అంశాలను హెచ్‌ఎంలకు తెలియజేయవచ్చని ఆయన విద్యార్థులకు సూచించారు. పాఠశాల నిర్వాహణ, మధ్యాహ్న భోజన పథకంపై ఫిర్యాదులు చేయడానికి ప్రతి పాఠశాలలో ఫిర్యాదుల బ్యాక్సులు ఏర్పాటు చేశామని, విద్యార్థులు తమ అభిప్రాయాలను ఆయా బాక్సులో వేయవచ్చునని తెలిపారు. ఫిర్యాదు చేసిన వారి పేరు రహస్యంగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థుల సామర్థ్యాన్ని ఆయన తెలుసుకుని పలు సూచనలు ఇచ్చారు. ఈ మేరకు ఉపాధ్యాయుల లెసన్ ప్లానింగ్ రికార్డులను పరిశీలించారు. విద్యార్థులు భాషా నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలని, క్రమ శిక్షణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. హెచ్‌ఎం తోటకూర సాయిరామకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దామోదరం ఆశయ సాధనకు కృషి చేయాలి



మున్సిపల్ కార్యాలయంలో సంజీవయ్య చిత్రపటానికి నివాళులు అర్పించిన కమిషనర్ తదితరులు

సామర్లకోట: ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి రాష్ట్ర రెండో ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య అన్నారు. సంజీవయ్య జయంతి సందర్భంగా శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. సంజీవయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మేనేజరు కనకరాజు, ఆర్వో శ్యామల ఇతర సిబ్బంది పాల్గొన్నారు. అలాగే బచ్చుఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో హెచ్‌ఎం తోటకూర సాయిరామకృష్ణ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంఈఓ-2 పి పుల్లయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్ని సంజీవయ్యకు నివాళులు అర్పించారు.

భూసర్వే సమగ్రంగా చేయండి



తహసీల్దార్లను ఉద్దేశించి మాట్లాడుతున్న ఆర్డీవో మల్లిబాబు

కాకినాడ సిటీ: మండలాల్లో జరుగుతున్న భూ సర్వేను సమగ్రంగా నిర్వహించాలని ఆర్డీవో ఎస్.మల్లిబాబు అన్నారు. శుక్రవారం కాకినాడ ఆర్డీవో కార్యాలయంలో తహసీల్దార్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రతి కార్యాలయంలో 3వ శనివారం స్వచ్ఛ భారత్, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించాలని, రెవెన్యూ, వ్యవసాయ, ఉద్యానవన శాఖలతో రైతు వివరాలు నమోదు వేగవంతం చేయాలని ఆదేశించారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ స్టేషన్లను సందర్శించి మౌలిక సదుపాయాల ఏర్పాట్లకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థకు వచ్చిన దరఖాస్తులను నిర్ణీత గడువులో పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీబీపీ చైనులు, తహసీల్దార్లు వి.జితేంద్ర, ఎస్ఎల్ఎస్ కుమారి, పి.త్రినాథరావు, కె.చిన్నారావు, జీఆర్ ఠాగూర్, కె.సత్యనారాయణ, ఎస్.సత్యనారాయణ, కె.చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కళాశాలకు సామగ్రి బహూకరణ



కళాశాలలో ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న దివీస్ ప్రతినిధులు

పిఠాపురం: దివీస్ లేబొరేటరీ అధికారులు సుమారు రూ.20 లక్షల విలువైన ఫర్నిచర్‌ను స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు అందజేసినట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుభాషిణి తెలిపారు. విద్యార్థుల సౌకర్యార్థం, కాంపౌండ్ వాల్, ఫర్నిచర్ ఏర్పాటుకు ఆ సంస్థ యాజమాన్యం సుమారు రూ.75 లక్షల విలువైన ఫర్నిచర్‌ను, సామగ్రిని ప్రకటించారని ఆమె తెలిపారు. అందులో భాగంగా ముందుగా ఈ సామగ్రిని అందజేసినట్లు ఆమె తెలిపారు. సామాజిక స్పృహతో విద్యాభివృద్ధికి ఆ సంస్థ యాజమాన్యం దోహదం చేస్తోందని ఆమె తెలిపారు. డ్యూయల్ డెస్కులు 20, ఆఫీసు టేబుళ్లు 20, కంప్యూటర్ టేబుళ్లు 20, కంప్యూటర్లు 20, ప్రిన్సిపాల్ టేబుల్ 1, మంచినీటి కోసం ఆర్ఓ ప్లాంట్‌ను సమకూర్చారని ఆమె తెలిపారు. నూతనంగా నిర్మించిన కళాశాలలో విద్యార్థులకు కనీస వసతులు లేక విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఇవి పరిష్కరిస్తాయని తెలిపారు. ఈ సందర్భంగా దివీస్ లేబరేటరీ హెచ్‌ఆర్ విభాగం సీనియర్ మేనేజర్ ఆర్. సుధాకర్, వెల్ఫేర్ ఆఫీసర్ బి.వాసుబాబు, డిప్యూటీ సీఎం ఓఎస్‌డీ ఎన్‌వి శివరామ ప్రసాద్‌లను ప్రిన్సిపాల్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.ఉషశ్రీ, అధ్యాపకులు కె ఆనంద్, అలీబాబా, యూవీబీబీ కృష్ణ ప్రసాద్, కె.మాధవి, వి.అనంతలక్ష్మి, వి. పల్లవి తదితరులు పాల్గొన్నారు.

వనదుర్గ అమ్మవారికి చండీ హోమం



వనదుర్గ అమ్మవారికి చండీ హోమం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీ హోమం నిర్వహించారు. పండితులు ఉదయం తొమ్మిది గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11.15 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలను సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేదపండితులు యనమండ్ర శర్మ, వనదుర్గ ఆలయ అర్చకుడు కోట వంశీ, పరిచారకుడు వేణు వ్రతపురోహితులు చెల్లపిళ్ల ప్రసాద్, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం నిర్వహించారు. 20 మంది భక్తులు రూ.750 టిక్కెట్‌తో హోమంలో పాల్గొన్నారు.

సత్యదేవుని ప్రధానాలయంలో దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలోనూ, తొలిపావంచా వద్ద కొలువైన కనకదుర్గ అమ్మవారికి అర్చకుడు చిట్టెం గోపీ ఆధ్వర్యంలో పండితులు కుంకుమపూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పరిశోధనలకు రూ. 93 లక్షల మంజూరు

జేఎన్‌టీయూకే ఇన్‌చార్జి వీసీ మురళీకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ మురళీకృష్ణ

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జేఎన్‌టీయూకే వర్సిటీలో పరిశోధనలపై తొమ్మిది పరిశోధన ప్రాజెక్టులకు రూ.93 లక్షలు మంజూరైనట్లు జేఎన్‌టీయూకే ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ మురళీకృష్ణ తెలిపారు. రూసా కో-ఆర్డినేటరర్ ఎం.స్వరూపారాణి అధ్యక్షతన వీసీ సమావేశ మందిరంలో శుక్రవారం సమీక్ష జరిగింది. పరిశోధన ప్రాజెక్టులకు సంబంధించి మాజీ వీసీ జీవీఆర్ ప్రసాదరాజు, వి.శ్రీనివాసులు, బీటీ కృష్ణ, పద్మప్రియ, సీహెచ్ శ్రీనివాసరావు, జి.స్వామినాయుడు, వీఎస్ వకుళ, సీహెచ్ నీలిమాదేవి, విజయ ప్రసాద్‌లు ప్రాజెక్టు ప్రధాన పరిశోధకులుగా వ్యవహరిస్తున్నారన్నారు. పరిశోధన ప్రాజెక్టులకు అవసరమైన పరికరాలు సమకూర్చుకోవాలని సూచించి సంబంధిత జర్నల్లు ప్రచురితం అయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ రవీంద్రనాథ్ పాల్గొన్నారు.

ఘర్షణలో యువకుడికి కత్తిపోట్లు

- యండమూరులో ఘటన
- కేసు నమోదు చేసిన పోలీసులు



తీవ్రంగా గాయపడిన ఈశ్వరప్రసాద్



ఘటనా స్థలంలో ఆధారాలు సేకరిస్తున్న పోలీసులు

కరప: వేంకటేశ్వర స్వామి రథోత్సవంలో ఇద్దరి మధ్య చెలరేగిన వివాదం కత్తిపోట్ల వరకు దారితీసింది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలం యండమూరులో ఈ నెల 8వ తేదీన జరిగిన వేంకటేశ్వరుని రథోత్సవం నిర్వహించారు. రథం స్థానిక రామాలయం వద్దకు రథం చేరుకోగా అక్కడి యువకుడు, ఐటీఐ విద్యార్థి కుడుపూడి ఈశ్వరప్రసాద్ తన స్నేహితులతో కలసి తారాజువ్వలు వేశాడు. అక్కడే ఉన్న మార్నెళ్ల అజయ్, గుబ్బల కాలేబు, జిబేల్‌లు ఈశ్వరప్రసాద్ వద్దకు వచ్చి మాపైనే జువ్వలు వేస్తావా అని వాగ్వాదానికి దిగి నీ అంతు చూస్తానని దుర్భాషలాడుతూ అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ నెల 13వ తేదీన ఉదయం 10 గంటలకు ఈశ్వరప్రసాద్ కాలేజీలో ఉండగా అజయ్ ఫోన్‌చేసి నీతో మాట్లాడే పని ఉంది సాయంత్రం ఇంటికి రాగానే ఫోన్ చెయ్యి అని చెప్పాడు. ఈశ్వరప్రసాద్ ఇంటికి వచ్చాక తన సోదరుడు గుబ్బల సాయి, పితాని శేఖర్‌లను వెంటపెట్టుకుని మోటార్‌సైకిల్‌పై వెంకటేశ్వరస్వామి ఆలయం వద్దకు వెళ్లేసరికి అక్కడ అజయ్, కాలేబు, విజయ్, వినోద్, అనిల్, మనోహర్, లచ్చన్న ఉన్నారు. అక్కడ అజయ్‌తో జరిగిన తోపులాటలో ఈశ్వరప్రసాద్ కింద పడిపోయాడు. అంతలో మిగిలిన వారు ఈశ్వరప్రసాద్‌ను కదలకుండా పట్టుకోగా అజయ్ కోడి కత్తితో దాడిచేసి, చంపేస్తానంటూ విచక్షణా రహితంగా పొడిచి తీవ్రంగా గాయపరిచాడు. ఈ దాడిలో అతడికి తల, నుదురుకు ఇరువైపులా, ఎడమభుజం, కుడివైపు ఛాతీపై, ఛాతీకి మధ్య భాగంలో తీవ్రమైన రక్తపు గాయాలయ్యాయి. ఈశ్వరప్రసాద్‌పై దాడి చేస్తున్న వారిని అతడి ఐదుగురు స్నేహితులు అడ్డుపడి, చికిత్స కోసం రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఎస్ఐ టి.సునీత సిబ్బందితో కల్సి గురువారం రాత్రి క్షేత్రస్థాయిలో వివరాలు ఆరా తీసి అనంతరం రామచంద్రపురం ఆసుపత్రికి వెళ్లి, మెరుగైన వైద్యం కోసం బాధితుడిని జీజీహెచ్‌కు తరలించగా, చికిత్సపొందుతూ కోలుకుంటున్నాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం యండమూరులో ఎప్పుడేం జరుగుతుందోననే ఉద్రిక్తత నెలకొంది. సీఐ చైతన్యకృష్ణతో పాటు కరప, గొల్లపాలెం, కోరంగి, పెదపూడి, తిమ్మాపురం ఎస్ఐలు పహారా ఏర్పాటుచేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థినులను వేధిస్తున్న ఆకతాయిలు

కరప: ప్రేమికుల దినోత్సవం వేళ స్థానిక నక్కా సూర్యనారాయణమూర్తి జెడ్పీ ఉన్నత పాఠశాల సమీపంలో కొందరు ఆకతాయిలు అసభ్యంగా ప్రవర్తించారు. హైస్కూలు విద్యార్థినులు బస్ ఎక్కేందుకు శుక్రవారం సాయంత్రం రోడ్డుపక్కన నిలబడ్డారు. కొందరు ఆకతాయిలు అక్కడకు వచ్చి వారి పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తూ కామెంట్లు చేశారు. మరికొందరు మోటార్‌సైకిళ్లపై తిరుగుతూ విసిగించారు. స్థానికులు స్పందించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సిబ్బంది వచ్చి ఆకతాయిలను పట్టుకునే ప్రయత్నం చేయగా పారిపోయారు. పోలీసులు దగ్గరుండి, విద్యార్థినులను బస్ ఎక్కించి పంపించారు. కరప, వేళంగి, పెద్దాపురప్పాడు గ్రామాల్లోని హైస్కూళ్ల వద్ద నిత్యం తాము వచ్చి పోయే వేళల్లో ఆకతాయిలు ఇలాగే వ్యవహరిస్తున్నారని విద్యార్థినులు పోలీసులకు వివరించారు. పోలీసులు స్పందించి పాఠశాలల సమయంలో నిఘా పెట్టి, ఆకతాయిల వేధింపుల నుంచి విద్యార్థినులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ఉంది.